క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ హౌసింగ్ బోర్డు, స్పిన్నింగ్ మిల్లు కాలనీ 1, 2, స్వరూప్ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రెవెన్యూ కాలనీ, రాజీవ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, పాలిటెక్నిక్ కాలేజీ, గాయత్రీ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, ఏఎంజీ కాలేజీ, శ్రేయ గార్డెన్, రాజవోలు గ్రామంలో విద్యుత్ ఉండదు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ నరసమ్మ అన్నారు. అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అన్నపూర్ణమ్మపేట సెక్టార్ సిమెంట్రీ పేట అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, ప్రీ స్కూల్ పిల్లలకు భోగిపండ్లు వేసే కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, సిమెంట్రీ పేట ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం స్వరూపారాణి, అంగన్ వాడీ కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసరావు తదితరులు

ధవళేశ్వరం: టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను మంగళవారం ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐకమత్యంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఈ సూర్యనారాయణరాజు, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వికాస్ స్వచ్ఛంద సంస్థ సేవలు ఆదర్శనీయం


వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్న వికాస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఈస్ట్ ప్యారిస్ చర్చి పాస్టర్ మల్లిపూడి మార్టిన్ లూథర్ ప్రశంసించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ యార్లగడ్డ ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం వీఎల్ పురం పార్కులో వంద మంది వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్టిన్ లూథర్ మాట్లాడుతూ వికాస్ సంస్థ తన వంతు సామాజిక బాధ్యతగా 11 ఏళ్లుగా వృద్ధులకు పింఛన్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గోదావరి స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుబ్బల వెంకట రమణ, చల్లా వెంకటేశ్వర్లు, దుళ్ల రవి , కె.శ్రీనివాస్, ఎస్.రూపేష్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం

సీతానగరం: రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో అందించే మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని, పాడైన గుడ్లు పెడుతున్నారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఆ హైస్కూల్లో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా తనిఖీ అధికారి ఎస్.రేణుక మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా పలు అవకతవకలు బయటపడ్డాయన్నారు. భోజనాలు చేసే విద్యార్థుల సంఖ్యకు, బియ్యం నిల్వలకు మధ్య వ్యత్యాసం ఉందన్నారు. ఆయా దురుసుగా ప్రవర్తిస్తోందని, నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారన్నారు. భోజనం చేసే విద్యార్థులు తక్కువగా ఉన్నా, లెక్కల్లో అధిక సంఖ్యలో చూపుతున్నారన్నారు. నాలుగు నెలల నుంచి తేడా కనిపిస్తోందన్నారు. హెచ్‌ఎం శ్యామలాదేవి మాట్లాడుతూ రేషన్ షాపుల నుంచి వస్తున్న బస్తాలలో మూడు కిలోల చొప్పున బియ్యం తక్కువ ఉంటుందన్నారు. విద్యార్థులు ఆలస్యంగా పాఠశాలకు వస్తున్నారని, దీనివల్ల ఆన్‌లైన్ హాజరు కంటే ఎక్కువ మంది ఉంటున్నట్టు తెలిపారు. నాసిరకం గుడ్లు పెట్టడం లేదని, ఎక్కువగా ఉడకడం వలన పైతొక్క ఊడిపోవడంతో పాడైనట్టువిద్యార్థులు చెబుతున్నారన్నారు. ఆయాను మందలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశరావు, కె.భార్గవి, బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి లాక్ వేస్తే షాకే..

- తాళం వేసిన ఇళ్లను ఎంచుకుంటున్న దొంగలు
- విలువైన వస్తువుల మాయం
- వరస చోరీలతో ప్రజల బెంబేలు



బొమ్మూరులోని మురళీకొండపై ఓ ఇంట్లో సామగ్రిని చిందరవందరగా పడేసిన దొంగలు

ఎల్‌హెచ్‌ఎంఎస్‌లోగో

రాజమహేంద్రవరం రూరల్: తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు దొంగలు చోరీకి దిగుతున్నారు. బంగారం, నగదు, వెండి వస్తువులతో పాటు విలువైన సామాగ్రిని మాయం చేస్తున్నారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజుల్లో వరుసగా దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఘటనల్లో సుమారు 700 గ్రాముల బంగారం, రూ.4 లక్షల నగదు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నా ప్రజలు నిర్లక్ష్యం వహించడం వలనే ఈ చోరీలకు అదుపు లేకుండా పోతోంది.

వివరాలు ఇవే..

హుకుంపేట రామకృష్ణ నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని ఇంటిలో గత నెల 30వ తేదీన 350 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. బొమ్మూరు మురళీకొండపై ఆదివారం రాత్రి ఇరిగేషన్ ఉద్యోగి నాని ఇంట్లో 290 గ్రాముల బంగారం, రూ.80 వేలు మాయం చేశారు. వ్యాపారి ఉమా మహేష్ కుటుంబ సమేతంగా తిరుపతికి వెళ్లగా ఆయన ఇంటిలోని రూ.లక్ష నగదు, వెండి వస్తువులు అదృశ్యమయ్యాయి. మధుసూదనరెడ్డి ఇంటిలోని 66 గ్రాముల బంగారం, రూ.10 వేలు కనిపించలేదు. కేవీ రమణారెడ్డి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లగా బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. ఇవన్నీ ఇంటికి తాళం వేసిన ఇళ్లల్లోనే గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు.

అవగాహన కల్పిస్తున్నా..

పండగలు వస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆధ్వర్యంలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్, సిబ్బంది లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆటోల ద్వారా వీధుల్లో ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలకు మాత్రం పూర్తిస్థాయిలో అవగాహన కలగడం లేదు. ఊరికి వెళ్లే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఏర్పాటు చేసి చోరీలు జరగకుండా కాపాడతామని చెబుతున్నప్పటికీ ప్రజల్లో మాత్రం ఎటువంటి చలనం ఉండడం లేదు.

అప్రమత్తతతో చోరీలకు చెక్



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లేవారు తప్పకుండా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. పోలీస్ యాప్ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి చోరీలకు చెక్ పెట్టవచ్చు. అపార్టుమెంట్లు, ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ఇంటిలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలను ఉంచకూడదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతే డయల్ 100, 1090కి నంబర్లకు ఫిర్యాదు చేయాలి.

– భవ్య కిషోర్, డీఎస్పీ, సౌత్‌జోన్, ఈస్ట్ జోన్(ఇన్‌చార్జి), రాజమహేంద్రవరం

రంగోత్సవ్‌లో కడియం విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయురాలు సువర్ణవేణి తదితరులు

కడియం: బొమ్మూరు డైట్ కాలేజీలో మంగళవారం రంగోత్సవ్ 2024–25 పేరిట నిర్వహించిన పలు పోటీల్లో కడియం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉపాధ్యాయురాలు బూసి సువర్ణవేణి ఆధ్వర్యంలో బహుమతులు గెలుచుకున్నారు. డిజిటల్ కంప్యూటర్ విభాగంలో వై.యోగిసత్య ప్రియాంక ప్రథమస్థానంలో నిలిచింది. రంగోళిలో ఎస్.ప్రియదర్శిని, కుసుమ, శ్రీలక్ష్మి, అనుష్క, రూప, సత్యశ్రీ ద్వితీయ స్థానాలు సాధించారు. జానపద నృత్యంలో కె.స్నేహ అక్షయ ద్వితీయ, పాటల విభాగంలో ఎం.వీరదుర్గానందిని, చిత్రలేఖనంలో వి.హేమశృతి, క్విజ్‌లో శశికళ, హ్యాండ్ రైటింగ్‌లో టి.శివనాగతేజ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ విద్యార్థులను స్కూలు హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీనుద్దీన్, డేవిడ్ తదితరులు అభినందించారు.

స్వర్ణాంధ్ర సేవలు అభినందనీయం


రగ్గులు పంపిణీ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: మదర్ థెరిస్సా స్ఫూర్తితో రెండున్నర దశాబ్దాలుగా స్వర్ణాంధ్ర సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. లాలా చెరువులోని ఆ సంస్థ ప్రాంగణంలో పునర్నిర్మించిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర రాంబాబు అంకిత భావంతో సేవలు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. స్వర్ణాంధ్రకు ఎలాంటి సహకారం కావాల్సిన తాను అందిస్తానని హామీ ఇచ్చారు. రాంబాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా నగర ప్రజలు, దాతల సహకారంతో ఎలాంటి ప్రభుత్వ , విదేశీ నిధులు లేకుండా దాతల విరాళాలతో నడుపుతున్నామన్నారు. అవసరార్థులకు సేవలు అందించేందుకు మరింత అంకిత భావంతో పనిచేస్తామన్నారు. అనంతరం వృద్ధులకు రగ్గులు, కాస్మోటిక్, మనిషికి రూ.100 చొప్పున సుమారు 200 మందికి ఆదిరెడ్డి వాసు చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో మరుకుర్తి రవి యాదవ్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా 'బొమ్మూరు'


స్పోర్ట్స్‌మీట్‌లో సాధించిన బహుమతులతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ నాగవేణి

రాజమహేంద్రవరం రూరల్: కృష్ణా జిల్లా మోపిదేవి ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ పాఠశాలలో రెండు రోజులుగా జరిగిన జోనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాలికల విభాగంలో బొమ్మూరు ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నాగవేణి మంగళవారం ప్రకటనలో తెలిపారు.
- కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, షటిల్‌లో విన్నర్లుగా నిలిచారు.
- 1500 మీటర్ల పరుగుపందెంలో బి.అమిత (ప్రథమ), బి.ఉమారాణి (ద్వితీయ), 800 మీటర్లలో బి.అమిత (ప్రథమ), బి.ఉమారాణి(ద్వితీయ), 100 మీటర్లలో యు.దుర్గా అంబిక (ద్వితీయ) ప్రతిభ చూపారు.
- 4.100 రిలేలో బి.అమిత, ఎస్.పూర్ణసూర్యకుమారి, యు.దుర్గాఅంబిక, యు.లక్ష్మీప్రణీత ప్రథమ స్థానం సాధించారు.
- లాంగ్‌జంప్‌లో బి.అమిత (ప్రథమ), హైజంప్‌లో బి.అమిత (ప్రథమ), ట్రిపుల్‌జంప్‌లో యు.దుర్గాఅంబిక (ద్వితీయ) బహుమతులు గెలుచుకున్నారు.
- షాట్‌పుట్‌లో ఎల్.గాయత్రి (ప్రథమ), ఎస్.హర్షశ్రీ (ద్వితీయ), డిస్కస్‌త్రోలో ఎల్.గాయత్రి (ప్రథమ), ఎస్.హర్షశ్రీ (ద్వితీయ) ప్రతిభ చూపారు.
- జావెలిన్‌త్రోలో ఎల్.గాయత్రి (ప్రథమ), ఎస్.హర్షశ్రీ (ద్వితీయ) విజేతలుగా నిలిచారు. వీరందరినీ, శిక్షణ ఇచ్చిన పీఈటీ కె.రమ్యను ప్రిన్సిపాల్ ఆర్.నాగవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆస్తి నేరాలను త్వరితగతిన పరిష్కరించండి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లాలో గత ఐదేళ్లలో నమోదైన ఆస్తి నేరాలను త్వరితగతిన పరిష్కరించాలని, ఆస్తి నేరాల్లో నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని సీఐలు, ఎస్సైలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ గ్రేవ్ ప్రాపర్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆస్తి నేరాలలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆస్తి నేరాల్లో అధికారులు ప్రత్యేక చొరవ చూపించి నిందితులను అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, పవన్ కుమార్ రెడ్డి, ఐటీ కోర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్ప రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగమ్మ తల్లి ఆలయంలో చోరీకి యత్నం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని నాగమ్మ తల్లి ఆలయంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆలయ గురువు గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. గాడాల గ్రామంలోని నాగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి ఆభరణాలను అపహరించడానికి సోమవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. మోటారు సైకిల్‌పై వీరు గేటు తాళం బద్దలుకొట్టి లోపలకు వెళ్లారు. దొంగల రాకను ఆలయ సమీపంలో ఉన్న కుక్కలు గమనించి, గట్టిగా మొరగడం ప్రారంభించారు. వాటిని అరుపులు విని ఆలయ గురువు నాగబాబు, కుటుంబ సభ్యులు మేల్కొన్నారు. ఆ దొంగలను గమనించి, గట్టిగా కేకలు వేశారు. దీంతో ఆ ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దొంగలు వదిలేసిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. పిడింగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆవరణలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వార్షిక పరీక్షల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతితో పాటు మిగిలిన తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణ, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పునాది గట్టిగా ఉంటేనే ఎన్ని అంతస్తుల భవన నిర్మాణాన్ని అయినా చేపట్టడం సాధ్యం అవుతుందన్నారు. అదే విధంగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలో బోధన పద్ధతులు భవిష్యత్తుకు పునాది అన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి శిక్షణ ప్రణాళిక, సామగ్రి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపవిద్యాశాఖాధికారులు పాత్ర కీలకమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో రెగ్యులర్, ప్రైవేటుగా 25,723 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. గత ఏడాది 29,990 మంది విద్యార్థులు హాజరు కాగా 83.20 శాతం ఉత్తీర్ణత సాధించారని, సప్లిమెంటరీ పరీక్షల్లో 77.57 శాతంగా ఉందన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో అది 92.24, 97.28 శాతంగా ఉందని తెలిపారు. 2024–25 లో నూటికి నూరుశాతం సాధించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల వర్గపోరు

- జనరిక్ దుకాణం విషయంలో బయటపడిన విభేదాలు
- ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు



జనరిక్ షాపు ముందు ఆందోళన చేస్తున్న ఒకవర్గం


సమీపంలో నిలబడి ఉన్న మరో వర్గం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని జనరిక్ మందుల దుకాణాన్ని ఖాళీ చేయాలంటూ ఒక వర్గం, ఖాళీ చేయబోమని మరోవర్గం ఘర్షణ పడుతున్నాయి. అది కూడా అధికార పార్టీకి చెందిన ఇరు ఎమ్మెల్యేల వర్గీయులు ఇలా గొడవకు దిగడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. తమ దుకాణం ఖాళీ చేయాలని కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారంటూ సోమవారం కొందరు మహిళలు ప్రభుత్వాసుపత్రి జనరిక్ మెడికల్ షాప్ వద్ద ఆందోళన చేశారు. మరో వర్గం దుకాణం తాము దక్కించుకున్నామని, తమకు అప్పగించాల్సిందేనని కూర్చున్నారు. ఈ ఘటనలో ఒకరు ఆదిరెడ్డి అప్పారావు వర్గీయులు, మరొకరు గోరంట్ల వర్గీయులు. ఈ వివాదం చిలికి చిలికి గాలివానలా ముదిరి తెలుగుదేశం పార్టీలోనే వర్గ పోరాటాన్ని బయటపెట్టింది. మందుల షాపు దుకాణం నిర్వహిస్తున్న కాళీకృష్ణ మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు పిల్లా తనూజ మాట్లాడుతూ తమను బలవంతంగా ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. తాము కొంతకాలంగా మందుల దుకాణం నిర్వహిస్తున్నామని, 2024 నుంచి 2029 వరకు తమకే కేటాయిస్తున్నట్లు జిల్లా సమాఖ్య తీర్మానించిందన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తండ్రి అప్పారావు తన మనుషులతో దౌర్జన్యంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సహాయంతో తాను ఈ దుకాణం నిర్వహిస్తున్నానని, దీన్ని స్థానిక టీడీపీ నాయకులు ఖాళీ చేయించేందుకు దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మిసూర్యప్రభ మాట్లాడుతూ కాళీకృష్ణ మహిళా శక్తి సంఘానికి మందుల దుకాణం నిర్వహించేందుకు సమయం అయిపోయిందన్నారు. దీంతో వేరే మహిళా సంఘానికి కేటాయింపు జరిగిందన్నారు. గత మూడు నెలలుగా దీనిపై నోటీసులు ఇస్తున్నా స్పందన లేదన్నారు. కాగా.. దుకాణం నిర్వహణ సమయం పూర్తయితే టెండర్ ద్వారా లీజుకు ఇవ్వాలే కానీ, ఇష్టారాజ్యంగా నచ్చిన వారికి కేటాయించడమేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ దుకాణ వివాదం వివాదాస్పదమైంది. ఒకవైపు ఆదిరెడ్డి వర్గీయులు మరోవైపు గోరంట్ల వర్గీయులు బైఠాయించడం జనాలను నివ్వేరపరిచింది. అధికార పార్టీలోని అంతర్గత ముసలాన్ని బయటపెట్టింది.

లేపాక్షిలో 20 శాతం వరకూ రాయితీ


థీమాటిక్ ఎగ్జిబిషన్‌లో వస్తువుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్ ఎంపోరియంలో సంక్రాంతి వరకూ కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, వైట్‌వుడ్ బొమ్మలు, కలంకారి శారీస్, క్రోచెట్ లేస్, చేనేత వస్త్రాలపై 15 నుంచి 20 శాతం రాయితీ అందజేస్తున్నారు. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం షోరూమ్ మేనేజర్ జి.మోనిక్ మంగళవారం తెలిపారు. అలాగే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న థీమాటిక్ ఎగ్జిబిషన్ ఈ నెల 9వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో తయారీదారులు తాము తయారు చేసిన వస్తువులను విక్రయిస్తారన్నారు.

గెయిల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రేమ్‌కుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (గెయిల్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మాతంగి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఎం.మాధురి ఆర్‌టీజీఎస్ డిప్యూటీ సీఈవోగా బదిలీ అయ్యారు.

పేపర్ మిల్లు లాకౌట్ ఎత్తివేత

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆంధ్రా పేపర్ మిల్లు మంగళవారం నుంచి లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆదివారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన విషయం తెలిసిందే. వేతన సవరణ విషయంలో కార్మికులు, యాజమాన్యానికి మధ్య ఐదు మాసాలుగా తర్జన భర్జనలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. మళ్లీ యాజమాన్యం మంగళవారం ఉదయం నుంచి లాకౌట్ ఎత్తివేయడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు. సంక్రాంతి తర్వాత వేతన సవరణపై స్పష్టత ఇవ్వనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్


సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శివారున పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. వారిలో వంగలపూడికి చెందిన ఒకరు, రఘుదేవపురానికి చెందిన ముగ్గురు ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.5,400 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

నేషనల్ వర్క్‌షాపులో ఫొటోగ్రాఫర్ల ప్రతిభ


ప్రతిభ చూపిన ఫొటోగ్రాఫర్లు బుజ్జి, అభిరామ్

రాజానగరం: ఒడిశాలోని బొండాస్‌లో సోమ, మంగళవారాలలో జరిగిన హుస్సేన్ ఖాన్ 7వ నేషనల్ వర్క్‌షాప్‌లో మండలానికి చెందిన ఇద్దరు ఫొటోగ్రాఫర్లు బహుమతులు అందుకున్నారు. శ్రీకృష్ణపట్నం బుజ్జికి వెండి పతకం, కొత్త తుంగపాడుకు చెందిన గొల్లపల్లి అభిరామ్‌కు తృతీయ బహుమతి దక్కింది. గిరిజన తెగలలో అంతరించిపోతున్న బొండా తెగకు సంబంధించి సంప్రదాయాలు, వేషధారణలు, నృత్యాలు, వారి జీవనశైలిపై తీసిన ఫొటోలతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు, ఫొటో జర్నలిస్టులు హాజరయ్యారు. వీటిలో వీరిద్దరూ బొండా తెగకు సంబంధించిన తీసిన ఫొటోలకు పైబహుమతులను అందుకున్నారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ,క్రావెన్
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: మార్కో
రాజా	: పుష్ప–2
రంభ	: బచ్చలమల్లి
ఊర్వశి	: క్రావెన్
మేనక	: ఆటోరంగ, చేతిలో చెయ్యేసి చెప్పుబావ
కుమారి	: రఘువరన్ బిటెక్
అప్సర	: పుష్ప–2
అశోక	: మార్కో
నామవరం	
వివిఎస్.మహల్	: పుష్ప–2, క్రావెన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప–2
కడియం	
వెంకటసూర్య	: మార్కో, పుష్ప–2